క్లుప్తంగా

మూగజీవాలను హింసించడం నేరం

ఆకివీడు: మూగజీవాలను హింసించడం నేరమని, వాటిపై దయతో ఉండాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు కె.జనార్ధన్ రావు పిలుపునిచ్చారు. స్థానిక సరోజినీనాయుడు బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం జంతువుల హక్కులు, వాటి సంరక్షణ, సంక్షేమంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల్ని హింసిస్తే 1960 జంతు సంరక్షణ చట్టం ద్వారా శిక్ష వేస్తారని హెచ్చరించారు. పశువుల్ని రోడ్లపైకి వదిలివేయడం, వాటికి ఆహారం పెట్టకపోవడం, వంటివి నేరమన్నారు. కార్యక్రమంలో మండల పశుసంవర్ధక శాఖ అధికారిణి భార్గవి సత్య, జెడ్పీ స్కూల్‌హెచ్‌ఎం ఇందిర తదితరులు పాల్గొన్నారు.

కేపీ పాలెం నార్త్‌లో పంటబోదె తవ్వకం



కేపీ పాలెంలో పంట బోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: మండలంలోని పంట బోదె తవ్వకం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మొగల్తూరు పంచాయతీలోని నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం, పాలకమ్మచెరువు తదితర ప్రాంతాలతో పాటు మండలంలోని కేపీ పాలెం నార్త్, సౌత పేరుపాలెం నార్త్,సౌత్ గ్రామాల్లో పంటబోదె పనులు చురుగ్గా సాగుతున్నాయి. శుక్రవారం కేపీ పాలెం నార్త్‌లో చేపట్టిన పనులను జేఈ ఆనంద టీపీ వెంకటేశ్వర రావు పరిశీలించారు. శివారు భూముల్లోని ప్రతి ఎకరాకూ సాగు నీరందేలా పంటబోదె పనులు త్వరతగతిన పూర్తి చేయాలని కూలీలకు సూచించారు.

క్షీరారామలింగేశ్వరుని సన్నిధిలో చండీహోమం



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా చండీహోమం నిర్వహించారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో నిర్వహించిన చండీహోమంలో 32 మంది దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం హోమంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రం, జాకెట్ ముక్కలు, ప్రసాదం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి యార్ల సూర్యనారాయణ హోమం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రెండు గడ్డివాముల దగ్ధం



గొల్లవానిచెరువులో దగ్ధమవుతున్న గడ్డివాము

పాలకొల్లు అర్బన్: మండలంలోని పాలకొల్లు రూరల్ పంచాయతీ పరిధిలోని నాగరాజుపేట, వడ్లవానిపాలెం పంచాయతీ పరిధిలోని గొల్లవానిచెరువులో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో 20 ఎకరాల రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గొల్లవానిచెరువులో ఉప్పలపాటి రాజేష్‌కు చెందిన 10 ఎకరాల గడ్డివాము, నాగరాజుపేటలో కేఎస్ఎన్ రాజుకి చెందిన 10 ఎకరాల గడ్డివామును గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని సమాచారం అందుకున్న పాలకొల్లు ఫైర్ ఆఫీసర్ వైవీ జానకిరామ్, నరసాపురం ఫైర్ ఆఫీసర్ కె భాస్కర రావు సిబ్బందితో మంటలను అదుపు చేశారు. ఆస్తి నష్టం సుమారు రూ.80 వేలు ఉంటుందని ఫైర్ ఆఫీసర్ జానకిరామ్ విలేకరులకు తెలిపారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు.

ఉపాధి నిధులు విడుదల చేయాలి

పెనుగొండ: గ్రామీణ పేదల, కష్టజీవుల స్థితిగతులను మెరుగుపర్చే విధంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా పని చేస్తున్న ఉపాధి కూలీలకు సకాలంలో నిధులు విడుదల కాక అనే ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కమిటీ కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం తామరాడ, దేవ, రామన్నపాలెం, వడలి గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించి, ఉపాధి కూలీల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. రెండు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు పడలేదన్నారు. మెడికల్ కిట్టులు, కొలతలు వేసేందుకు ఉపయోగించే టేపు గానీ ప్రభుత్వం నుంచి సరఫర లేక కార్మికులే సమకూర్చుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల దేవ గ్రామానికి చెందిన ఉపాధి కూలీ గుడాల లలిత పాము కాటుకు గురై అస్వస్థత పాలైందన్నారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిధులు విడుదల చేసి ఉపాధి కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సంఘ కార్యదర్శి షేక్ పాదుషా తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన సహజ రాజయోగతో సత్ఫలితాలు

భీమవరం: భీమవరం పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం లూథరన్ హైస్కూల్ ఆవరణలో అంతర్జాతీయ యోగ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజయోగిని బ్రహ్మకుమారి రేవతి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాన్ని గుర్తుచేసే ప్రాచీన సహజ రాజయోగ పద్ధతి ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమన్నారు. యోగాసనాలతో పాటు మానసిక ఆరోగ్యం కోసం మెడిటేషన్ తప్పకుండా చేయాలన్నారు. శ్రీకృష్ణదేవరాయ పతంజలి యోగ మిత్రమండలి యోగా గురువు రామాయణం రమేష్‌బాబు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వడుపు గోపి, యోగా గురువులు అయిశెట్టి వెంకటేశ్వర్లు, బిల్డర్స్ అసోసియేషన్ గౌరవఅధ్యక్షుడు గన్నాబత్తుల శ్రీనివాస్, తటవర్తి నవీన్ పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో యోగా శిక్షణ

భీమవరం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం భీమవరం మండల న్యాయసంస్థ ఆధ్వర్యంలో 2వ అదనపు జ్యూడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో జడ్జిలు, న్యాయవాదులకు యోగా శిక్షణ నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇన్‌స్ట్రక్టర్ కలిగొట్ల గోపాలశర్మ యోగాసనాలు వేయించారు. పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి ఎస్ సోమశేఖర్, సివిల్ జడ్జి బి అప్పలస్వామి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి సురేష్‌బాబు, 1వ అదనపు సివిల్ జడ్జి పి హనీషా, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో.....

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థులు శారీరక, మానసిక వికాసానికి యోగ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కళాశాలలో యోగా శిక్షకుడు పి.రమేష్‌రాజును ఘనంగా సత్కరించారు. ఇంజనీరింగ్ కెమిస్ట్రీ హెడ్ పి భవాని, వినోద్ కుమార్, యోగా ట్రైనర్ బాపిరాజు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆర్ కృష్ణ చైతన్య, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ హరిమోహన్ పాల్గొన్నారు.



దుంపగడప వీవీగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా సాధన చేస్తున్న దృశ్యం



ఎంపీడీఓ కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న అధికారులు



భీమవరంలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో యోగా సాధన



భీమవరం కోర్టు ఆవరణలో యోగాసనాల్లో పాల్గొన్న న్యాయమూర్తులు, నాయవాదులు



ఉండిలో విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడుతున్న వైద్యాధికారులు



పతంజలి యోగా ఆరోగ్య కేంద్రంలో యోగా గురువులను సత్కరిస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న యోగాసనాలు

భీమవరం: భీమవరంలోని శ్రీచింతలపాటి బాపిరాజు మెమోరియల్ (ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎం) హైస్కూలు, డీఎన్నార్ జూనియర్ కళాశాల విద్యార్థులు పోల్‌పైనా, రోప్ మీద వేసిన యోగాసనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇంటర్ నేషనల్ యోగా డే సందర్భంగా శుక్రవారం స్కూల్ వ్యాయమ ఉపాధ్యాయులు శ్రీ పిసి శేఖర రాజు,డీవి రామభద్రరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. స్కూల్ హెచ్‌ఎం బి. శ్రీనివాసరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.శివాజీరాజు, షకీలా పాల్గొన్నారు.

యోగాతో మనిషికి ఎంతో ఆరోగ్యం

ఉండి: మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే యోగా సాధనకూడా చేయాలని ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి సీహెచ్ ధనలక్ష్మీ, డాక్టర్ బెన్నీ సామ్యూల్ అన్నారు. శుక్రవారం యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పంచాయితీ కార్యాలయాల వద్ద అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు.

ఆకివీడులో..

ఆకివీడు: మందుల్లేని మన పురాతన శాస్త్రీయ వైద్యం యోగ అని యోగ గురువు మోటుపల్లి వెంకట సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కె.సుజాత చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక పతంజలి యోగారోగ్య కేంద్రం, ఎంపీడీఓ కార్యాలయ, దుంపగడప వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలు పాఠశాలల్లో యోగా కార్యక్రమాలను చేపట్టారు. దుంపగడప కళాశాలలో యోగా గురువు వెంకట సత్యనారాయణ, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యోగా ప్రాధాన్యతను వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ రామకృష్ణ, సూపరింటెండెంట్ శ్రీకర్, ఏఓ ప్రియాంక, యోగాసనాచార్యులు డాక్టర్ ప్రతాప్ కుమార్, కందుల సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా గురువుల్ని ఏఎంసీ మాజీ చైర్మన్ వానపల్లి బాబూరావు సత్కరించారు.

యోగా శిక్షకులకు సత్కారం



భీమవరం కేంద్ర సహాయమంత్రి కార్యాలయంలో యోగా శిక్షకులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రపంచానికి మనదేశం అందించిన అమూల్యమైన బహుమతి యోగా నేటి మానవాళికి వరంలాంటిదని రాష్ట్ర విశ్వహిందూ పరిషత్ సభ్యుడు వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు అన్నారు. భీమవరంలోని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్‌వర్మ కార్యాలయంలో శుక్రవారం యోగ దినోత్సవం సందర్భంగా యోగ శిక్షకులకు నిర్వహించిన సత్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రెండేళ్ల పిల్లల నుంచి వృద్ధుల వరకు యోగా చేయవచ్చునని, యోగా చేయడం ద్వారా ఎటువంటి ఆరోగ్య సమస్యలు దరిచేరవన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ కలిగొట్ల గోపాల్‌శర్మ, అల్లూరి సాయిదుర్గరాజు, అరసవల్లి సుబ్రమణ్యం, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కాయిత సురేంద్ర, రామాయణం రమేష్ మాట్లాడుతూ కాసేపు చేసే యోగాతో ఒంటికి బలం, మనసుకు ప్రశాంతత అన్నారు. అనంతరం యోగ శిక్షకులు మేక రాజు, భవానీ, కె రాఘవ, శ్రీవెంకటేశ్వర్లు, రామాయణం రమేష్, శర్మను సత్కరించారు.

మోస్ట్ పాపులర్ వైశ్యమెన్ అవార్డు గ్రహీత సాయికి సత్కారం



భీమవరంలో సాయిని సత్కరిస్తున్న వాసవి వనిత కేసీజీఎఫ్ సభ్యులు

భీమవరం: ప్రజాదరణ పొందిన వైశ్య ప్రతినిధు లకు అందించే ఆర్యవైశ్య లైమ్‌లైట్ మోస్ట్ పాపులర్ వైశ్యమెన్ అవార్డు భీమవరం పట్టణానికి చెందిన పులవర్తి సాయికి దక్కింది. ఈ అవార్డులను తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతులమీదుగా అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం భీమవరంలో గునుపూడి వాసవి వనిత కేసీజీఎఫ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సాయి మాట్లాడుతూ తనకు అవార్డు రావడానికి తోడ్పాటునందించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో సభ్యుల ప్రోత్సాహంతో భీమవరంలో గో గ్రీన్ సొసైటీ అనే సంస్థను ఏర్పాటుచేయనున్నట్లు చెప్పా రు. వాసవి వనిత కేసీజీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు జి. రమ్య, కె.సుభాషిణి, కోశాధికారిణి కె.అనూష పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి



భీమవరంలో జాతీయ లోక్ అదాలత్‌పై మాట్లాడుతున్న జడ్జి సోమశేఖర్

భీమవరం: పోలీసు అధికారులు, న్యాయవాదులు కోర్టుకు, కక్షిదారులకు మధ్య వారధిగా వ్యవహరించి జాతీయ లోక్ అదాలత్ ప్రాముఖ్యతను కక్షిదారులకు తెలియజేయాలని భీమవరం పోక్సో కోర్టు జడ్జి ఎస్ సోమశేఖర్ అన్నారు. ఈనెల 29న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం కోసం శుక్రవారం పోక్సో కోర్టులో స్థానిక న్యాయవాదులు, పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సివిల్ జడ్జి బి అప్పలస్వామి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి సురేష్‌బాబు, ఒకటవ అదనపు సివిల్ జడ్జి పి హనీషా, 2వ అదనపు సివిల్ జడ్జి డి ధనరాజు, భీమవరం డీఎస్పీ వి నారాయణస్వామిరెడ్డి, న్యాయవాదులు కె జ్యోతి, వి సుబ్బారావు, ఆర్ సుబ్బయ్య పాల్గొన్నారు.

రైతుల సమష్టి కృషితో కాలువల అభివృద్ధి



వెంకయ్య వయ్యేరు కాలువ అభివృద్ధి పనులు చేస్తున్న దృశ్యం

కాళ్ల: రైతులు, డిపార్ట్‌మెంట్ సమన్వయంతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశాలతో పంట కాలవల అభివృద్ధి పనులు చేస్తున్నట్లు కలవపూడి గ్రామానికి చెందిన రైతు మంతెన పెదనరసింహ రాజు తెలిపారు. శుక్రవారం ఆయనతో పాటు కలవపూడి గ్రామానికి చెందిన రైతులు కాలువ అభివృద్ధి పనులను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. పరిమెళ్ల లాకులు వద్ద నుంచి ఏలూరుపాడు శివారు వరకు కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఇటీవల జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో ఆయన స్పందించి సంబంధిత శాఖ, రైతుల సమన్వయంతో నిధిని ఏర్పాటు చేసి కాలువలు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారని చెప్పారు. దీంట్లో భాగంగా రైతుల పర్యవేక్షణలో తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సుమారు 35 రోజులు పాటు 45 కిలోమీటర్ల మేర కాలువ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. దీంట్లో భాగంగా ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలో వెంకయ్య వయ్యేరు వంటకాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో రైతులు నల్లపరాజు వెంకటరాజు,వేగేశ్న సత్యనారాయణ రాజు,వేగేశ్న శ్రీనివాసరాజు, మంతెన శివాజీ రాజు, ముదుండి శ్రీనివాసరాజు, సాగిరాజు చిరంజీవి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐసీఎఫ్ వార్షికోత్సవం

ఉండి: ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ 28వ వార్షికోత్సవాన్ని ఉండి ఎన్నార్పీ అగ్రహారంలో ఘనంగా నిర్వహించినట్లు శాఖ జిల్లా అధ్యక్షుడు బందెల జార్జ్ ప్రతికా ప్రకటనలో తెలిపారు. గురువారం రాత్రి ఏఐసీఎఫ్ నాయకుడు గొల్ల దానియేలు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మత్తి రాజ్‌కుమార్, కన్నెగంటి రూత్‌కళ,బందెల ప్రమీల తదితరులు పాల్గొని క్రైస్తవుల సమస్యలు, వాటి పరిష్కారం తదితర విషయాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. సంస్థ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేసి క్రైస్తవుల పక్షాన పోరాడాలని నాయకులు సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాసామగ్రి అందజేత



చెరుకుమిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు



మహదేవపట్నంలో విద్యార్థులకు కిట్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం



శృంగవృక్షం స్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆకివీడు: విద్యార్థులు ప్రభుత్వం, దాతలు అందజేస్తే సౌకర్యాలతో విద్యా ప్రమాణాల్ని మెరుగు పరచుకోవాలని సర్పంచ్ నందమూరి ప్రకాశం, మాజీ సర్పంచ్ బొర్రా సుజాత విజ్ఞప్తి చేశారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో శుక్రవారం విద్యా కిట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి కష్టపడి, ఇష్టపడి చదువుకోవాలన్నారు. ఉన్నత శిఖరాల్ని అధిరోహించి, జన్మభూమికి దోహదపడాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సైదాల సూర్యనారాయణ, శివరామరాజు, బొర్రా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహదేవపట్నంలో..

ఉండి: చదవుకోవడం మనిషి లభించే గొప్ప వరమని దానిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ జుత్తిగ నాగరాజు,సర్పంచ్ వనిమీ సుబ్బలక్ష్మీ అన్నారు. శుక్రవారం మహదేవపట్నం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జుత్తిగ శ్రీనివాస్, టీడీపీ నాయకులు వనిమా శ్రీనివాస్ పాల్గొన్నారు.

శృంగవృక్షంలో..

పాలకోడేరు: ఆర్యవైశ్యులు దాతృత్వానికి చిరునామా అని సామాజిక సేవలో ముందుంటారని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని శృంగవృక్షం గ్రామంలో ఎంపీపీ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు ఆర్యవైశ్య సంఘం ఆర్థిక సహకారంతో పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 80 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, నోట్ పుస్తకాలు, విద్యా సామగ్రిని దాత కూర్మాల బులి నాగేశ్వరరావు దంపతుల్ని అభినందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి కోటేశ్వరరాజు, బీసీ సంఘ నాయకుడు దొంగ కృష్ణ, గ్రంధి రాజా, సర్పంచ్ జంగం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య కారక పరిశ్రమలు నెలకొల్పవద్దు

భీమవరం: ఆకివీడు సమతానగర్ ప్రాంతంలోని కొల్లేరు 5వ కాంటూరు, నివాస ప్రాంతాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేస్తున్న ప్లాస్టిక్ కనికల తయారీ కంపెనీ నిలుపుదల చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆ ప్రాంత ప్రజలు కోరారు. శుక్రవారం భీమవరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆకివీడు పట్టణానికి చెందిన భైరి ఆంజనేయులు, ఓగిరాల ఏలీయా, డి కల్యాణి, వి శివరామరాజు, దారొకొండ వెంకటేష్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటిని కరిగించి ప్లాస్టిక్ కనికలుగా తయారు చేసే క్రమంలో కాలుష్యం వల్ల ఆ ప్రాంతం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావల్సి వస్తుందని అన్నారు. 5వ కాంటూరుకు ఐదు కిలోమీటర్ల వరకు ఎటువంటి కాలుష్య కారక పరిశ్రమలు పెట్టడానికి అనుమతి లేదన్నారు. ఫ్యాక్టరీ ప్రతిపాదిత ప్రాంతం దగ్గరలోనే ప్రభుత్వాసుపత్రి, నివాస ప్రాంతాలు, రైల్వే స్టేషన్, డైలీ మార్కెట్, చేపల మార్కెట్ వంటి నిత్యం జనం రద్దీగా ఉండే ప్రదేశాలున్నాయని అన్నారు. దీనికి స్పందించిన కలెక్టర్ సుమిత్ కుమార్ ఫ్యాక్టరీ నెలకొల్పే ప్రాంతాన్ని పరిశీలించిన తరువాత తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమతానగర్ వాసులు చెప్పారు.

అభయాంజనేయ స్వామికి లక్ష తులసి పూజ

యలమంచిలి: గుంపర్రు పంచాయతీ సుంకరపాలెంలో ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక, సుబ్రహ్మణ్య ప్రయుక్త శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో ఆలయ అర్చకులు వేదాంతం సుబ్రహ్మణ్యం బ్రహ్మత్వంలో మొదటి రోజు శుక్రవారం ఉదయం సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, అభిషేకం, ధ్వజస్తంభ కవచ సంప్రోక్షణ, కుంభాభిషేకం సాయంత్రం లక్ష తులసి పూజ, ఆంజనేయ హోమం, నీరాజన మంత్ర పుష్పాలు, ప్రసాద వితరణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు. దంపత సమేతంగా పెద్ద సంఖ్యలో భక్తులు లక్ష తులసి పూజ, ఆంజనేయ హోమంలో కూర్చున్నారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ఏకాహ భజన, ఆదివారం ఉదయం ఆలయం వద్ద ఉన్న ధ్వజ స్తంభానికి గ్రామానికి చెందిన రిటైర్డ్ డీవైఈఓ కొంపెల్ల వెంకట సూర్య సత్యనారాయణమూర్తి సహకారంతో ఇత్తడి కవచం తొడుగుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు. సాయంత్రం స్వామి వారి పల్లకీ ఊరేగింపు రాత్రి అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు వివరించారు. పూజా కార్యక్రమాలన్నీ మానేపల్లి సత్యనారాయణ (చిన్నబాబు) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ఆస్తుల విక్రయాన్ని నిలుపుదల చేయాలి

భీమవరం : విశాఖ స్టీల్ ప్లాంట్ ఆస్తుల అమ్మకాన్ని తక్షణం నిలుపుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరామ్ డిమాండ్ చేశారు. భీమవరంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టి దానిని దెబ్బతీయాలని చూడడం దారుణమన్నారు. కేంద్రం ప్రభుత్వం విశాఖపట్నం, హైదరాబాద్, ముంబై, చెన్నై, పూణెల్లోని విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆస్తుల్ని విక్రయించాలనే నిర్ణయం తీసుకున్నట్టుగా ప్రచారం జరుగుతోందన్నారు. విశాఖ ఉక్కు పోరాటాల్లో 32 మంది ప్రాణత్యాగాల ఫలితం విశాఖ స్టీల్‌ప్లాంట్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ విక్రయానికి వ్యతిరేకంగా ఎంతో కాలంగా ప్రజలు కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు పోరాటాలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేంద్రంపై ఒత్తిడి తెచ్చి తక్షణం విశాఖ ఉక్కు ఆస్తుల అమ్మకాన్ని నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలి బలరామ్ కోరారు.